గడియారం నాలుగుసార్లు గంటలు కొట్టింది.

పుష్యమాసపు చిరుచలి సన్నగా వణికిస్తూ వుంటే రగ్గు మరింత దగ్గరగా లాక్కొంది రామలక్ష్మి.

కళ్ళు భగభగా మండుతున్నాయి. తలమీద సుత్తితో కొడుతున్నట్లు పోటుగా వుంది.

లేచి కూర్చోవాలంటే శరీరం సహకరించడం లేదు.

రాత్రి డిన్నర్ అయేసరికి పదకొండు దాటింది. అలస్యంగా చేసిన భోజనం అరిగినట్లులేదు.

ఆదివారం వాడు కనీసం నల్గురైదుగుర్నయినా భోజనానికి తీసుకొని రాకుండా వుండడు రఘురాం.

సోమవారం నాడు తెల్లవారితే మళ్ళా యంత్రంలా పనులు మొదలు అవుతాయి.

రామలక్ష్మి నీరసంగా లేచింది.

రఘురాం గాఢనిద్రలో వున్నాడు.

నెమ్మదిగా లేచి మేడ దిగింది.

కూతురి గదిలో లైటు దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

గుండెల మీద సినిమా పత్రిక ఫేన్ గాలికి రెపరెపలాడ్తోంది.

చెదరిన ఆ అమ్మాయి పమిట సవరించి లైట్ తీసేసి సావిట్లోకి వచ్చింది.

వేడిగా కాఫీ తాగింది.

సారిడాన్ మాత్ర మింగింది.

అయినా తలపోటు తగ్గలేదు.

వనజ లేచి వచ్చింది.

# పిల్లతెమ్మెర

## నందుల సుశీలాదేవి

మామగారు అప్పటికే నిద్రలేచి కూర్చొన్నారు. "లక్ష్మీ! లేచావా? కాస్త వేడివేడిగా కాఫీ యివ్వగలవా?"

గబగబా మొహం కడుక్కొని వచ్చింది రామలక్ష్మి.

వంటింట్లోకి వెళ్ళి పాలు ఫ్రిజ్‌లోంచి తీసి కాఫీ చేసి మామగారికి ఇచ్చింది.

తెలతెలవారుతుంటే సోముని లేపింది.

"అబ్బ! వుండమ్మా! అంటూ మునగ దీసుకొని పడుకున్నాడు.

"లే! నాన్నా! అయిదవుతోంది."

"మై గుడ్‌నెస్!" అంటూ ఆదరా బాదరా లేచి రన్నింగ్‌కి వెళ్ళడానికి తయారయ్యాడు.

పెసరపప్పు నీళ్ళలో పోసింది.

"వదినా!, ప్రాక్టికల్స్ వున్నాయని చెప్పాను కదా! కాస్త పెందరాడే లేవ కూడదూ!"

ధుమధుమలాడుతూ బాత్‌రూంలోకి పరుగెత్తింది.

ఆరు దాటిపోతోంది. పనిమనిషి రాలేదు. సింక్‌లో వున్న గిన్నెలు చూసేసరికి రామలక్ష్మికి కళ్ళు తిరిగాయి.

ఇంక మరి ఆలోచించ లేదు. పెసర పప్పు గ్రైండర్‌లో వేసి గబగబా అల్లం పచ్చిమిరపకాయలు తరిగేసింది.

అంట్ల గిన్నెలన్నీ తొందర తొందరగా తోమేసింది.

పాల పేకెట్స్ తీసుకుని పాలకుక్కర్‌లో పోసి స్టవ్ మీద పడేసింది.

గబగబా స్నానం చేసి వచ్చింది.

దేముడి మీద రెండు పువ్వులు పడేసి ఓ దండం పెట్టింది.

అంతలో సునీత "అమ్మా! పెసరట్" అంటూ వచ్చింది.

కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది రామలక్ష్మికి.

ఓ క్షణం విశ్రాంతి తీసుకోవాలని వుంది.

ఆ వూహని అంతలోనే అదిమి పెట్టింది.

కారం లేకుండా మామగారికి టిఫెన్ చేసింది. సునీత, వనజా కాఫీ టిఫెన్ ముగించారు.

మెడిసిన్ చదువుతున్నా వనజకి వదిన గారే జడ వేయాలి.

ఆడపడుచు పని పూర్తి చేసే సరికి కొడుకు వచ్చాడు.

స్నానం చేసి టిఫెన్ తిని ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్ళిపోయేడు.

సునీత విమెన్స్ కాలేజీకి వెళ్ళిపోయింది.

ఎనిమిది దాటుతుండగా రఘురాం మేడ దిగి వచ్చేడు.

"అబ్బ! రాత్రి చాలా అలసిపోయాను లక్ష్మీ! మెలకువ రానేలేదు".

రఘురాంతో వున్న చిక్కల్లా అతను బాగా తింటాడని అనుకొన్ననాడు ఏమీ తినడు.

మూడు దోసెలకంటె తినడని కొంచెం పిండి వుంచితే వరసగా అయిదు దోసెలు తిని లేచాడు.

తనకి తల నొప్పిగా వుంది.

వాంతి అయేలా వుంది. తనకి టిఫెన్ లేకపోయినా పరవాలేదు. కాని అతను మరి కొన్ని దోసెలు అడగకుండా వుంటే అంతే చాలుననుకొంది.

రఘురాం టిఫెన్ ముగించి లేచేసరికి తేలిగ్గా నిట్టూర్చింది రామలక్ష్మి.

పది గంటలు అయేసరికి వంట పూర్తవాలి.

మామగారు పెందరాళే భోజనం చేస్తారు, ఆదరా బాదరా వంట మొదలు పెట్టింది.

ఇంతలో పనిమనిషి కొడుకు వచ్చి వాళ్ళ అమ్మకి జ్వరం వచ్చిందని చల్లగా చెప్పివెళ్ళేడు.

రామలక్ష్మి లోలోపల అనుకుంది.

నాల్గంకెల జీతం వున్న ఆఫీసర్ పెళ్ళాంగా పుట్టేకంటే పనిమనిషిగాపుట్టినా యీ రోజు తనకి విశ్రాంతి దొరికేది.

మరోసారి కాఫీ తాగింది.

కాని వెంటనే భళ్ళునవాంతి అయింది. మొహం కడుక్కొనివచ్చి భోజనాల బల్ల మీద తల పెట్టుకుని పడుకుంది.

మామగారు వచ్చి టేబిల్‌మీద కంచం పెట్టుకొంటున్నారు.

గబగబా లేచి మొహం తుడుచుకొని ఆయనకు వడ్డించింది.

అంతలో కారియర్ మనిషివచ్చింది.

వనజకీ, సోమూకీ, సునీతకీ, కారియర్లు పంపాలి. రఘురాం మధ్యాహ్నం లంచ్ ఆఫీస్ కాంటీన్‌లోనే తీసేసుకుంటాడు. మామగారి భోజనం పూర్తయి కారియర్లు యిచ్చేక బాత్‌రూంలోకివెళ్ళిచూస్తే గుండె గుభేలుమంది.

రెండు బకెట్ల నిండుగా విడిచిన బట్టలు పడివున్నాయి.

"ఎంత జీతం ఇస్తున్నా ఏ పనిమనిషీ పట్టుమని పదిరోజులు యీ ఇంట్లో చేయదు. ఇందుకే పారిపోతున్నారు" అనుకొంది రామలక్ష్మి.

అవన్నీ వాషింగ్ మెషిన్‌లో పడేసింది.


కాని బట్టల్ని ఆరవేసేసరికి వంటికి నలవరం కూడా వచ్చింది.

పన్నెండవుతోంది. వంటిల్లూ, దేముడి గదీ తప్ప ఇల్లంతా సంతలా వుంది.

తుడిచే ఓపికలేక డ్రాయింగ్ రూం పైపైన సర్దేసింది.

పిల్లల గదులు చూసేసరికి భయంవేసి తలుపులు దగ్గరగా నొక్కేసింది.

భోజనం చేయాలంటే వాంతి అవుతుందేమోనని అనుమానం వచ్చింది.




అద్దంలో చూసుకుంటే కళ్ళుమందార పువ్వుల్లా వున్నాయి.

ఒక్క గంట నడుం వాలిస్తే తర్వాత లేచి మామగారికి హార్లిక్స్ యివ్వవచ్చు ననుకొంది.

పోర్టికోలో టాక్సీ ఆగిన చప్పుడయింది. పెద్ద ఆడపడుచు, యిద్దరు కూతుళ్ళతో దిగింది.

రామలక్ష్మి బలవంతాన నవ్వుతూ వాళ్ళని లోపలికి ఆహ్వానించింది.

"అన్నయ్యకి జీతం ఎక్కువయిన కొద్దీ వదిన చిక్కిపోతోంది."

రామలక్ష్మిమీద వో కామెంట్ పారేసి తండ్రి దగ్గరకు వెళ్ళిపోయింది.

పిల్లలిద్దరూ "ఆకలేస్తోంది అంటీ!" అంటూ రామలక్ష్మి వెనుకనే వచ్చారు.

బంగాళాదుంపలు తరిగి బజ్జీలు వేసి, కాస్త రవ్వకేసరి కలియబెట్టింది.

అందరికీ టిఫెన్లు, కాఫీలు యిచ్చేసరికి సునీత వచ్చింది.

"అమ్మా! అత్తయ్యతో సినిమాకు వెళ్ళొద్దా?" అంది.

పెద్దాడపడుచు వారానికి నాల్గు సినిమాలు చూస్తుంది.

సునీత, ఆవిడ ముస్తాబయి వెళ్ళిపోయారు. పిల్లలిద్దరూ యిల్లు పీకి పందిరి వేస్తున్నారు. అంతలో అలసిపోయిన మొహంతో వనజ వచ్చింది.

"ఏమే లట్టీ! మీ అమ్మ ఏది? రావటం, సినిమాకు వెళ్ళిపోవటం కూడా అయిపోయిందన్న మాట." కాసేపు పిల్లల్ని పలకరించి కాఫీ టిఫెన్ అవనిచ్చి బుక్స్ తీసుకొని స్నేహితులయింటికి "కంబైండ్ స్టడీస్"కని వెళ్ళిపోయింది.

సోమూ వస్తూనే తుపాన్‌లా వచ్చేడు.

"అమ్మా! అర్జెంటుగా వో నలభై రూపాయలు కావాలి. ఓ బుక్ కొనాలి."

టిఫెన్ కూడా తినకుండానే తిరిగివెళ్ళిపోయేడు.

రామలక్ష్మికి రోజంతా ఏమీ తినకుండా వుండటంలో విపరీతమైన నీర్సంగావుంది.

తల దిమ్ము కాస్త తగ్గినట్లుగా వుంది.

రాత్రి వంటకు పుప్రక్రమిస్తుంటే కను చీకట్లు పరుచుకోసాగేయి.

రఘురాం ఆఫీసు నుంచి క్లబ్బుకి వెళతాడు. రాత్రి పొద్దుపోయికాని రాడు.

వంట పూర్తయితే వో పది నిముషాలు పడుకోవచ్చు ననుకొంది.

మామగార్కి చపాతీలు చేసి యిచ్చేసింది. చిన్నపిల్ల లిద్దరికీ అన్నాలు పెట్టేసింది.

"అమ్మయ్య!" అనుకొంటూ గదిలోకి వెళ్ళబోయింది.


అంతలో ఫోను మోగింది. భర్త కంఠస్వరం!

"లక్ష్మీ! నాతోపాటు యిద్దరు స్నేహితులు వస్తున్నారు. మనింట్లోనే భోజనం చేస్తారు-"

రామలక్ష్మి నెమ్మదిగా అంది. "మీ పెద్ద చెల్లి వచ్చేరు."

"ఐ సీ! ఈపాటికి సినిమాకు చెక్కేసి వుంటుంది. సరే! తొమ్మిదికల్లా డిన్నర్ రెడీ చేయి."

కాసేపు ఆ బల్ల దగ్గర అట్లాగే నిలబడిపోయింది రామలక్ష్మి.




"ఇంటికి దీపం యిల్లాలు.

ఆ యింటికే కనువెలుగు...."

శ్రావ్యంగా వినిపిస్తున్న రేడియోనోరు నొక్కేసింది. మరో రెండు అయిటమ్స్ చేయాలి అతిథి దేవుళ్ళ కోసం....

"ఇంట్లో ఖాళీగానే వుంటావు కదోయ్! ఓ నల్గురికి వండిపెట్టలేవూ!"

భర్త నవ్వుతూ పరిహాసం చేస్తాడు.

"వదినా! రోజంతా ఖాళీగానే వుంటావు కదా! నా చీరకి ఫాల్సుకుట్టిపెట్టవూ!"

వనజ వేడికోలు.

"అమ్మా! వంట అయాక బోర్ కొట్టదూ! నా నోట్సు రాసి పెట్టమ్మా"

సునీత అభ్యర్థన.

"అమ్మా! అబ్బ నా రూం ఏమిటి యింత దర్టీగా వుంది? మధ్యాహ్నం నీ లీజర్ టైంలో సర్దకూడదూ!"

సోమూ చిందులు.

"లక్ష్మీ! పగలు పనిలేనప్పుడు నా దగ్గిర కూర్చొని కాస్త పుత్తరాలు వ్రాసి పెడుదూ!"

మామగారి ఆజ్ఞ.

తెల్లవారు జామున నాలుగు గంటలకి నిద్రలేస్తే రాత్రి పదివరకూ వరుసగా పనులుంటాయి.

పద్దెనిమిది గంటలు యంత్రంలా పని చేస్తేనే అందరికీఅన్నీ అమురుతున్నాయి.

లేబర్ రూల్స్‌లో ఏ మనిషికీ యిన్ని వర్కింగ్ అవర్స్ లేవు.

ఇండియాలో యింటికి దీపంవంటి యిల్లాలికి మాత్రం ఏ సూత్రాలూ వర్తించవు.

రామలక్ష్మికి గుండెలో నుంచి దుఃఖం పొంగుకొని వచ్చింది.

ప్రొద్దుటనుంచీ తనకి వంట్లోబాగుండలేదు.

మెడిసిన్ చదువుతున్న వనజకాని, కడుపున పుట్టిన పిల్లలుకాని, ఇరవైయేళ్ళ నుంచీ కాపురం చేస్తున్న భర్తకాని తన అనారోగ్యం గమనించనే లేదు.

తను తిందో, లేదోననే ధ్యాస లేదు వాళ్ళకి. కన్నకూతురు సినిమాకు వెళ్ళిపోతే పతిదేవుడు మరో యిద్దరు అతిథులను వెంటబెట్టుకొని మరీ వస్తున్నాడు.

అన్నీ ఎక్కడి వక్కడ వదిలేసి ఏమయితే అయిందని పక్కఎక్కి ముసుగు పెట్టుకోవాలని వుంది రామలక్ష్మికి.

కాని అట్లా చేయలేకపోయింది.

తిరిగి వంటింట్లోకి వెళ్ళి వంటను పునఃప్రారంభం చేసింది.

వంట చేస్తుంటే క్షణ క్షణానికీ అనిపించసాగింది.

పిల్లలూ, భర్తా అందరికీ తమ స్వార్థం తప్ప మరొకటి తెలియదు.

ప్రొద్దుట నుంచి యింత అలసిపోయి అనారోగ్యంగా వుంటే యింటిలో యింతెడు జనం తమ అవసరాలు తీర్చుకొని వెళ్ళేరుకాని,వాళ్ళ ఆ జీవన వేగంలో ఒక్కక్షణం తనని పరిశీలించిన వాళ్ళు లేరు.

ఈ సంసారం కోసం తను రక్తం ధారపోసి శ్రమిస్తున్నది?

రామలక్ష్మి కళ్ళ వెంట బిందువులు రాలి వెచ్చగా చేతిమీద పడ్డాయి.

ఎట్లాగో వంట పూర్తిచేసి అన్నీ

టేబిల్ మీద అమర్చింది.

చెవుల్లోంచి హోరు రాసాగింది. అంతలోనే సోమూ కంఠస్వరం విని సావిట్లోకి వచ్చింది.

అంతవరకే రామలక్ష్మికి తెలుసు.

* * *

చేతిమీద చురుక్కుమనేసరికి కళ్ళు నెమ్మదిగా తెరిచింది.

ఫామిలీ డాక్టరు చేతిమీద ఇంజక్షను ఇస్తున్నాడు.

రఘురాం ఆదుర్దాగా ఆమెనే చూస్తున్నాడు.

వనజ, సునీత బిక్కమొహాలు వేసుకొని నుంచొని వున్నారు.

పక్కలో పెద్దాడబడుచుకూర్చొనివుంది. సోము "అమ్మా!" అంటూ పలకరిస్తున్నాడు.

రామలక్ష్మి నెమ్మదిగా లేవబోయింది.

"లేవకు వదినా!" అంది వనజ.

"మాట మాత్రమైనా తనకి వంట్లో బాగుండలేదని చెబితే వనజ కాలేజీమానేసి యిల్లు చూసుకొనేది. శరీరాన్ని అంత విపరీతంగా శ్రమపెట్టేయటం ధర్మం కాదు."

మామగారి మాటలకు రామలక్ష్మి తలెత్తి చూసింది.

వనజ హార్లిక్స్ కలిపి తీసుకొని వచ్చింది.

రఘురాం భార్యను నెమ్మదిగా లేవదీసి కొంచెం కొంచెంగా తాగించేడు.

సోమూ పాదాల మీద చేయివేసి "తాగమ్మా" అన్నాడు. సునీత బెదురుగా చూస్తోంది.

రామలక్ష్మికి తలనొప్పి కాస్త తగ్గి బలంగా అనిపించి లేవబోయింది.

"వద్దు! వద్దు! లేవకు" అంటూ తిరిగి ఆమెను నెమ్మదిగా పడుకోబెట్టేడు రఘురాం.

"మీ గెస్ట్సు?"

"ఇంకెక్కడి గెస్ట్సు? అమ్మ కళ్ళు తిరిగి పడిపోయిందని సోమూ ఫోను చేయగాని పరిగెత్తుకొని వచ్చేసేను. బహుశా ఏ హోటల్‌కో వెళ్ళివుంటారు యీ పాటికి. నువ్వు కదలకుండా రెస్టు తీసుకో! పెద్దచెల్లి యిల్లుచూసుకొంటుంది. వో వారం రోజులు మంచం దిగకు."



పోపూరి రమాదేవి, తిమ్మసముద్రం

"అవును వదినా! అంతగా సినిమాకు వెళ్ళాల్సివస్తే సెకండుషోకి వెడతాను. ఓ వారం రోజులు నిన్ను వంటింటి పరిసరాల్లోకి కూడా రానీయను. రేపు మా ఆయనకి ఫోను చేసి యిప్పట్లో రానని చెప్పేస్తానులే."

"అవును వదినా! నేనూ, అక్కా పని అంతా చూసుకొంటాము, నువ్వు బెడ్ రెస్టు తీసుకోవాలి."

సునీత నెమ్మదిగా అంది.

"నాకు చాలా ఏడుపు వచ్చింది అమ్మా!"

రఘురాం అన్నాడు.

"సరే! తనని కాసేపు నిద్రపోనీయండి. నడవండి. అందరూ భోజనాలు చేయవచ్చును."

అందరూ వెళ్ళిపోయారు.

రఘురాం కూడా వెళ్ళబోయేవాడు తిరిగి వెనక్కి వచ్చి రామలక్ష్మి చెంపలు నిమురుతూ అన్నాడు.

"అంత అలసిపోయి పనిచేయటం ఎందుకు లక్ష్మీ! నేను వో పదిరోజులు సెలవుపెట్టి నిన్ను చూసుకొంటాను. నువ్వు ఆరోగ్యంగా వుంటేనే మేమంతా నీ వుపగ్రహాల్లా తిరగగల్గుతాం. లేకపోతే అంతా గందరగోళం అయిపోతుంది. అండర్‌స్టేండ్!"

రామలక్ష్మి రెండు కళ్ళూ నీటితో నిండిపోయాయి.

రఘురాం ఆమె కన్నీరుని మృదువుగా తుడిచేడు.

"యూ! సిల్లీగాల్! నాల్గురోజులు విశ్రాంతి తీసుకొంటే మళ్ళా పెళ్ళి కూతురిలా అయిపోతావు."

రామలక్ష్మికి చిత్రంగా సిగ్గువేసింది.

అందరూ గదిలోనుంచి వెళ్ళిపోయాక తృప్తిగా నిట్టూర్చబోయింది.

కొంచెం సేపటి క్రితం తన మనస్సు వీళ్ళందర్నీ స్వార్థపరులుగా చిత్రించింది.

కాని—కాని తనకి కొంచెం అనారోగ్యం చేయగానే తన ఆప్తులంతా ఎంత కలవరపడిపోయేరు!

ఇంటిలో నిత్యం మసిలే ఆత్మీయుల అనురాగ పరిమళం గుప్తంగా దాగి వుంటుంది.

కాని ఏ చిన్న పిల్లతెమ్మెర తగిలినా ఆ సువాసన గుబాళిస్తూనే వుంటుంది.

హాయిగా నిట్టూర్చబోయింది. కాని సాధ్యంకాలేదు.

రామలక్ష్మి మనస్సంతా వంటింటి చుట్టూనే పరిభ్రమించసాగింది.

సునీత నేతిగిన్నె వంపేసి వుంటుంది.

వనజ వడ్డిస్తే పులుసులో ముక్కలన్నీ అడుగునే వుండిపోతాయి.

సోమూ మారు వడ్డన ఏనాడూ అడగడు. వాడి ఆకలి కనిపెట్టి వడ్డించాలి.

మామగార్కి కారం అసలు పడదు. ఉప్పులేకుండా తీయాలి.

పెద్దాడబడుచుకి యిన్నిరకాలు చేయాలంటే విసుక్కొంటుంది.

ఒక్కసారి వంటింట్లోకి వెళ్ళి చూడాలనిపించింది.

కాని రఘురాం తనని బలవంతంగా యీడ్చుకొని వచ్చి మంచం మీద పడవేస్తాడని భయం వేసింది.

ఈ మంచం, యీ విశ్రాంతి తనని బంధిస్తున్నట్లుగా అనిపించసాగాయి.

అంతలోనే డాక్టరు యిచ్చిన నిద్ర మాత్రల ప్రభావం ఆమె మీద చూపించడంతో నెమ్మదినెమ్మదిగా కన్నులు మూసుకొంది రామలక్ష్మి.